# మిత్ర

అలా అక్కడ అప్పుడు మిత్రవింద కనబడుతుందని అనుకోలేదు.

మా బ్రాంచీలోని గుమాస్తా వొకతను పదిహేను రోజులనుంచీ రుయా హాస్పిటల్లో వున్నాడు. చూసి రావడం కోసం హాస్పిటల్‌కు బయల్దేరాను.

సాయంకాలం అయిదుగంటలు కావస్తున్నా యెండ నిప్పులు చెరుగుతోంది. కొండల పైనుంచి వీస్తున్న గాలి సైతం వేడి గానే వుంది. వేసవి దెబ్బను తట్టుకోలేక చెట్లు కూడా సోలిపోయి వున్నాయి.

మా కొలీగ్‌ను పరామర్శిస్తూ వుండగా వాతావరణం అమాంతంగా మారి పోయింది. ఆకాశాన్ని మేఘాలు కమ్మేశాయి. నేల బాజా మైన దబదబా మంటూ పెద్ద పెద్ద చినుకులు రాలసాగాయి. అరగంటసేపు యెడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వేలకొలది దోసిళ్ళతో దాహాన్ని తీర్చుకున్న తరువాత భూమి చల్లబడింది.

రోగిని పరామర్శించడం ముగిశాక మెయిన్ బిల్డింగులోంచి బయటికొచ్చాను. కొండగాలి మిత్రుడి పలకరింపులా చల్లగా, హాయిగా శరీరాన్ని చుట్టేసింది. తిరుపతి వొక్క అరగంటలో పూటీగా మారిపోయినట్టు తోచింది. నవ్వుతున్న చెట్లలోంచి నీటి ముత్యాల జల్లు రాలుతోంది. సిగరెట్టు వెలిగించుకున్నాను.

వుమెన్స్ హాస్టల్ మలుపు తిరిగి కార్డియాలజీ వార్డు వైపు నడవసాగాను.

వార్డు వరండాలో నిల్చుని వుంది మిత్రవింద.

ఆమెను చూసిన సంభ్రమంలో ''మిత్రా!'' అన్న పిలుపు గొంతులోనే ఆగిపోయింది. దాదాపు అదే సమయంలో ఆమె నా రాకను గమనించినట్టుంది. దూరం నుంచే పెదవుల కలయిక కనబడుతోంది.

గబగబా అడుగులు వేశాను. దగ్గరికి వెళ్ళి నిల్చున్న తరువాత ఆమె తల పైకెత్తి చూసింది.

కుంభమేళా *

ద్రాక్షపళ్ళంత పెద్ద కన్నీటిబొట్లు కిందికి జారాయి.

కంగారుపడుతూ-''ఏమైంది మిత్రా?'' అని అడిగాను.

''మా మామగారు...'' మరో రెండు కన్నీటి బిందువులు నేల రాలుతుండగా ఆమె నా చేయి గబుక్కున పట్టుకుని ''రాజా...నాకు భయంగా ఉంది'' అంది.

''ఏమయింది మీ మామగారికి?'' అని ప్రశ్నించాను.

''హార్ట్‌అటాక్''

''డాక్టరేమన్నాడు?''

''డాక్టర్ లేడు.''

''లేడా? యెక్కడి కెళ్ళాడు?''

''యింటికెళ్ళిపోయాడన్నాను.''

''యింతకీ యెప్పుడు జాయిన్ చేశారు?''

''గంటయింది. డాక్టరు అయిదుకంతా ఇంటికెళ్ళిపోయాడట. హౌస్ సర్జన్ అడ్మిట్ చేసుకున్నాడు. పరిస్థితేమీ బాగలేదంటున్నాడు రాజా! నాకు భయంగా ఉంది.''

ఆమె నా చేతిని వదిలిపెట్టలేదు. కళ్ళలోంచీ కన్నీరు జారుతూనే ఉంది.

''యింత మాత్రానికే అంత భయపడతారా యెవరైనా? చిన్నపిల్లల్లా ఆ కన్నీళ్ళే మిటి? వూరుకో. గుండెనొప్పి యిప్పుడు మునుపట్లా భయంకరమైన జబ్బేమీ కాదు. అసలింతకూ పరిస్థితెలా వుందో వెళ్లి అడిగి తెలుసుకుంటాను. నువ్వేమీ గాభరా పడకు'' అంటూ ఆమెను బుజ్జగించిన తరువాత వార్డులోకి వెళ్ళాను.

హౌస్ సర్జన్ లోపలెక్కడో పనిలో వున్నాడంటూ నర్సు ముంగిట్లోనే అటకాయించింది. నేనొచ్చిన పని తెలియచేసిన తరువాత - ''రోగి పరిస్థితి యెలాగుంది సిస్టర్?'' అంటూ వినయంగా ప్రశ్నించాను.

''అసలు మీరు మనుషులేనా? పరిస్థితింత క్రిటికల్ అయ్యేదాకా యేం చేస్తున్నారు మీరు? తీరా గొంతుపైకొచ్చి కూర్చున్నాక యిట్లా తీసుకొచ్చి మా ప్రాణాలు తీస్తే మేమేం చేయాలి? డాక్టర్లు కూడా మనుషులే! మెజీషియన్లు కారు....'' ఆమె విరుచుకుపడింది.

ఆమె ధోరణిని చూడగానే నాకుకూడా భయమే కలిగింది. ''పేషెంటును తీసుకొచ్చింది నేను గాదు సిస్టర్. ఆక్సిడెంటల్‌గా వాళ్ళవాళ్ళను కలిశాను. మీరెందుకు కోప్పడుతున్నారో నాకు అర్థం గావడం లేదు. వివరంగా చెప్పండి ప్లీజ్'' అన్నాను.

''పేషెంటు మూడురోజుల కిందటే వో.పి.లో వచ్చి కన్సల్టయి వెళ్ళాడు. డాక్టరు యింటెన్సివ్ కేర్‌లో అడ్మిట్ అవమని చెప్పారు. మూడు రోజులుగా నిర్లక్ష్యం చేసి, యిప్పుడు తీసుకొచ్చారు. పైగా అయిదున్నరకు వచ్చారు. డాక్టరు అయిదుకంతా యింటి కెళ్ళిపోయారు. యిక ఆయనొచ్చేది రేపటికే. పేషెంటు పరిస్థితి యేమీ బాగాలేదు.

డాక్టరింటికి ఫోన్ చేశాం. ఆక్సిజన్ పెట్టమన్నారు'' ఆమె లోనికి నడుస్తూనే చెప్పుకుపోసాగింది.

''డాక్టరిక యివ్వాల్టికి రానే రారా సిస్టర్?''

''అత్యవసరమయితే తప్ప రారు. ఆక్సిజన్ పెట్టాం గదా, అరగంట తరువాత చూద్దాం. అవసరమయితే మళ్ళీ వొకసారి డాక్టరుకు మేమే ఫోన్ చేస్తాం లెండి.....'' ఆమె తన కుర్చీలో కూర్చుని, లావుపాటి పుస్తకాన్ని ముందుకు లాక్కుని, యేదో రాసుకోవడం మొదలుపెట్టింది.

''డాక్టరుగారి యింటి అడ్రస్ మీకు తెలుసా?'' అని అడిగాను.

''అడ్రస్సెందుకు మీకు?'' అంది ఆమె చివాలున తల పైకెత్తి చూస్తూ.

''వోసారి యింటికెళ్ళి కలుద్దామని.''

''నోనోనో. యెప్పుడుపడితే అప్పుడు యింటికెళ్ళి డిస్టర్బ్ చేస్తే డాక్టరుగారు మండిపడతారు. అడ్రస్సు యిచ్చి యింటికి పంపామని తెలిస్తే మమ్మల్ని తోమేస్తారు'' ఆమె మళ్ళీ తన పని తాను చేసుకోవడం మొదలుపెట్టింది.

''డాక్టరు పేరేమిటి సిస్టర్'' పట్టువదలని విక్రమార్కుడిలా ప్రశ్నించాను.

రాసుకుంటూనే ''సుధీర్‌కుమార్'' అంది ఆమె.

యిక అంతకంటే ఎక్కువగా ఆమె మాట్లాడదన్న సంగతి అర్ధమైంది. బయటికొచ్చాను.

''యేమంటున్నారు?'' అంటూ మిత్రవింద పరుగులాంటి నడకతో వచ్చింది.

''డాక్టరు యింటెన్సివ్ కేర్‌లో అడ్మిట్ కమ్మంటే మీరెందుకు అడ్మిట్ చేయ లేదు?'' రెండు మూడు నిమిషాల పరిచయంలోనే నాపైన నర్సు ప్రభావం గాఢంగా పడినట్టుంది. నా ప్రశ్నలో చిరాకూ, కోపమూ స్పష్టంగా తొంగిచూశాయి.

మిత్రవింద బాణం దెబ్బతిన్న హంసలా విలవిలలాడిపోయింది. ''అయ్యయ్యో! నాకు కూడా ఆ సంగతి ముందుగా తెలియదు రాజా! మూడు రోజుల క్రితం చెకప్ చేయించుకోవడం కోసం ఆయనొక్కరే వచ్చారిక్కడికి. మామూలు చెకప్పేనని అన్నారు. డాక్టరేమన్నాడని అడిగితే మందులేవో రాసిచ్చాడని అన్నారు. నిన్నామొన్నా ఊళ్ళోని బంధువులనంతా కలిశారు. ఈ రోజు ఉదయం నేను బ్యాంకుకు వెళ్ళినప్పుడు కూడా బాగానే వున్నారు. అప్పటికీ నాకేదో సిక్స్‌సెన్స్ పనిచేసినట్లుంది. గంట పర్మిషన్ తీసుకొని ముందుగా యింటికెళ్ళాను. వెళ్ళేసరికి పడకపైన దొర్లుతూ కనిపించారు. వెంటనే హాస్పిటల్‌కు తీసుకొచ్చాను. వచ్చినప్పటి నుంచీ హౌస్ సర్జనూ, నర్సూ నన్ను దులిపిపారేస్తున్నారు. నాకేం చేయాలో తోచడం లేదు'' ఆమె గొంతు బొంగురుపోసాగింది.

నాకు కూడా యేం చేయాలో పాలుపోలేదు. శిలలా కాసేపు అలాగే నిల్చుండి పోయాను.

గాలి వీచినప్పుడల్లా వార్డు ముందున్న పున్నాగ చెట్టులోంచీ జల్లులు పైన బడుతున్నాయి. దూరంగా, హాస్టల్ ముఖద్వారం దగ్గర సందడిగా వుంది.

''చెప్పు రాజా! నర్సేమంటోంది? పరిస్థితెలా వుంది?'' మళ్లీ అడిగింది ఆమె.

సమాధానమేమని చెప్పాలో తోచలేదు. యేం చేయాలి? అవతల వో వ్యక్తి జీవన్మరణ పోరాటంలో కొట్టుమిట్టాడుతూవుంటే ప్రేక్షకమాత్రుడిగా చూస్తూండటం మినహాయించి, నేను చేయగలిగిందేమీ లేదా?

మిత్రవింద బాధను తొలగించే సాధనమేమిటి? యెందుకింత జడస్వరూపా న్నయిపోయాన్నేను? యేంచేయాలి? వున్నట్టుండి నాలోకి యేదో శక్తి ప్రవేశించి నట్టుగా తోచింది.

''నువ్వేమీ కంగారుపడొద్దు మిత్రా. యిక్కడే వుండు. మెన్స్ హాస్టల్లో నాకు తెలిసిన హౌస్‌సర్జనొకతనున్నాడు. నా స్నేహితుడికి తమ్ముడు. వెళ్లి కలుస్తాను. వీలయితే వోసారి డాక్టరు సుధీర్‌కుమార్‌ను కూడా కలుస్తాను. నువ్వలా లోపలికెళ్లి ఆ బెంచీపైన కూర్చో. నేనో అరగంటలో వచ్చేస్తాను.''

ఆమె లోపలికి వెళ్ళేవరకూ వేచి చూసే సమయం లేదు. చెబుతూనే వెనుదిరిగి మెన్స్ హాస్టలు వైపుకు నడవసాగాను.

హాస్టలు ముంగిటిలో కనిపించిన విద్యార్థిని వాకబు చేస్తే అడ్రస్సు దొరికింది. కానీ జగన్ గదిలో లేడు. పక్క గదిలో విచారిస్తే క్యాంటీను కెళ్ళాడన్నారు. క్యాంటీనుకు దారి అడిగి తెలుసుకున్నాను. అతను కాఫీ తాగుతూ కనిపించాడు.

''హలో బ్రదర్! యేమిటిలా వచ్చారు?'' అంటూ పలకరించాడు జగన్.

నేనొచ్చిన పనేమిటో గసలుబోస్తూ తెలియచేశాను.

''కార్డియాలజీనా? డాక్టరు సుధీర్‌కుమార్. అవును. వూళ్ళో వున్నది ఆయనొక్కడే. డాక్టరు రాంగోపాల్, యేదో పనిమీద వైజాగ్ వెళ్ళాడు. సుధీర్ కుమార్ అదోరకం మనిషి. లెటజ్ ట్రై. వెళ్లి కలుద్దాం. అడ్రస్సు తెలుసా మీకు?''

'' ఆ నర్సు అడ్రస్సు చెప్పనంది''

''వాళ్ళలాగే అంటార్లెండి'' అంటూ నవ్వేశాడతను. ''ఆ కాంపౌండ్‌వాల్ దగ్గర ఆటో లుంటాయి. వెళ్లి తీసుకురండి. నేనీలోగా వార్డు కెళ్ళి అడ్రస్సు తెలుసుకొని వస్తాను'' అంటూ అతను కార్డియాలజీ వార్డు వైపు కదిలాడు.

దాదాపు అరగంట ఆటో ప్రయాణం తరువాత డాక్టరు గారి యిల్లు కనిపించింది. పది నిముషాలసేపు ప్రాధేయపడిన తరువాత డాక్టరు సుధీర్‌కుమార్ మాతోబాటూ ఆటో యెక్కాడు.

ఆటో కార్డియాలజీ వార్డు ముందు ఆగినప్పుడు సమయం సరిగ్గా యేడున్నర.

హౌస్సర్జనూ, నర్సూ వరండాలోంచీ డాక్టరుగారికి స్వాగతం పలికారు. రోగి పరిస్థితిని గురించీ, వాళ్ళిచ్చిన ట్రీట్‌మెంట్‌ను గురించీ హౌస్సర్జను వివరిస్తూ వెంటరాగా డాక్టరు వార్డులోకి వెళ్ళిపోయాడు. జగన్ కూడా వాళ్ళననుసరించాడు.

మిత్రవింద నా దగ్గరకొచ్చి నిల్చొంది.

''ఆయనే డాక్టర్ సుధీర్‌కుమార్'' అన్నాను.

ఆమె ముఖంలో యింకా మబ్బులు ముసుగేసే వున్నాయి.

''నాకెందుకో చాలా భయంగా వుంది రాజూ'' అంది డగ్గుత్తికతో.

''మన ప్రయత్నమంతా మనం చేస్తూనే వున్నాము. లోపల డాక్టర్లు కూడా తంటాలు పడుతున్నారు. యిలాంటి సమయంలోనే ధైర్యంగా వుండాలి. అలా కూర్చుందాం పద.'' ఆమె చేయి పట్టుకు బెంచీపైన కూచోబెట్టాను.

కాసేపు యిద్దరమూ మౌనంగా కూచున్నాము.

అప్రయత్నంగా ఆమె చేయి పెదవులపైకి కదిలింది. గోళ్ళు కొరకసాగింది మిత్రవింద.

నాకప్పుడు ఆమె ముప్ఫయి రెండేళ్ళ అమ్మాయిలా కనిపించలేదు. దాదాపు పాతికేళ్ళ భూతకాలపు తెరలోంచీ అయిదారేళ్ళ అమ్మాయి అమాయకపు ముఖం స్పష్టంగా కనిపించింది. చిన్నప్పటి నుంచీ ఆమెకీ అలవాటుంది. యెలిమెంటరీ స్కూల్లో యీ అలవాటును మాన్పించడం కోసం మాస్టారు ఆమె అరచేతి మీద బెత్తంతో వాయించిన సన్నివేశం నాకింకా బాగా గుర్తుంది. అయిదో తరగతి వరకూ పక్కపక్కనే కూర్చొని, పాటాలు విని, తాయిలాలు పంచుకొని, ఆటలు ఆడుకున్న మా బాల్యం జ్ఞాపకం వచ్చింది. మంచీ, చెడూ తెలియని ఆ సుషుప్తిదశ తాలుకు అనుభవాలు నా మనస్సులో యింకా స్పష్టాస్పష్టంగా దోబూచులాడుతూనే ఉన్నాయి.

పెరిగి పెద్దయ్యాక కూడా ఆమెకు గోళ్ళు కొరికే అలవాటు పోలేదు. యేదయినా తీవ్రంగా ఆలోచిస్తున్నప్పుడు అప్రయత్నంగా గోళ్ళు కొరకడం మొదలుపెడతానని తానే నాతో చెప్పిందోసారి.

ఆమె ఆలోచనల్ని మరోవైపుకు మళ్ళించడం కోసం- ''మీ ఆయనెక్కడున్నాడు?'' అని అడిగాను.

''గూడూరు'' అంది.

''నువ్వేమో తిరుపతి. మీ ఆయనేమో గూడూరు. బాగుంది'' అంటూ నవ్వబోయాను.

''యేం చెయ్యమంటావు రాజూ? నేనేమో బ్యాంకు. తానేమో కాలేజీ. ఆయన అనంతపురంలో పనిచేస్తున్న రోజుల్లో, అతి కష్టంపైన అనంతపురానికి ట్రాన్స్‌ఫర్ తెచ్చుకున్నాను. తీరా నేను వెళ్ళేసరికి, మూడేళ్ళ పీరియడూ ముగిసిందని ఆయన్ని గూడూరుకు బదిలీ చేశారు. యిక లాభం లేదని, అత్తా, మామా అయినా దగ్గరగా వుంటారని యిక్కడికి ట్రాన్స్‌ఫర్ తెచ్చుకున్నాను. అయినా గూడూరు పెద్ద దూరమేమీ కాదు కదా! బస్సెక్కితే రెండున్నర గంటల ప్రయాణం'' తనను తానే వోదార్చు కుంటున్నట్టుగా చెప్పింది.

''మీ అత్తా, మామా యీ వూళ్ళోనే వుంటున్నారా?'' మరో సందేహాన్ని వెలిబుచ్చాను.

''పల్లెలోనే వుంటున్నారు. గొడ్డూ, గోదా, భూమీ, పుట్రా వదలిపెట్టి టవునుకు రావడం వాళ్ళకిష్టం లేదు. యిప్పుడు మా అత్తగారు అక్కడే వుంది. మా మామగారికి అప్పుడప్పుడూ టౌన్‌పైన ధ్యాస మళ్ళుతుంది. అప్పుడో రెండుమూడు రోజులు యిలా వచ్చేస్తుంటారు. యీసారి కూడా అలా యేదో వేరే పనిపైన వచ్చారనే అనుకున్నాను. ముందుగా తెలిసుంటే....''

వ్యవహారం తిరిగి తిరిగి మళ్లీ మొదటికొచ్చింది.

''మీ పాపాయి కిప్పుడెన్నేళ్ళు?'' ఆమె ఆదుర్దాను పట్టించుకోనట్టుగా నటిస్తూ ప్రశ్నించాను.

''నాలుగేళ్ళు.''

''నువ్వు బ్యాంకు కొచ్చేస్తే పాపనెవరు చూసుకుంటారు?''

''పనిపిల్ల వుంది''.

''మీ అమ్మానాన్నల దగ్గరుంచలేకపోయావా?''

''మా ఆయనొప్పుకోరు.''

''పోనీ మీ అత్తామామల దగ్గరుంచుకోమని చెప్పు.''

''ఆ పల్లెటూళ్ళో కాన్వెంటు లేదు.''

మిత్రవింద యెప్పుడూ అంతే! తనకు యిష్టం లేకపోయినా పెద్దవాళ్ళ మాటను శిరసావహించడమే ఆమె స్వభావం. హైస్కూలు మెట్టెక్కిన కొత్తలోననుకుంటాను. వోసారి వాళ్ళమ్మ ''మగరాయుడిలా అబ్బాయిలతో కలిసి ఆ ఆటలేమిటి?'' అంటూ కసురుకొంది.

అంతే! ఆ తరువాత ఆమె యెప్పుడూ మా జట్టులో కలవలేదు. చుట్టూ యెవరూ లేనప్పుడు నాతో రెండు మూడు నిమిషాలసేపు ఉత్సాహంగా కబుర్లు చెబుతూ వుండేది. దూరంగా యెవరైనా వస్తున్న సవ్వడి వినబడితే చాలు. అంతటితో మా సంభాషణ ఆగిపోయేది.

డిగ్రీ చదువుతున్న రోజుల్లో వొకసారి లైబ్రరీలో పలకరించింది. ''నాకో సహాయం చేస్తావా రాజా?'' అని అడిగింది.

తల వూపాను.

''కిరణ్ యిప్పుడెక్కడున్నాడో తెలుసుకదా?''

''మదరాసులో యింజనీరింగు కోచింగ్ తీసుకుంటున్నాడు.''

''నువ్వోసారి మదరాసు వెళ్లిరావాలి.''

''యెందుకు?''

''నన్ను పెళ్లి చేసుకుంటాడో, లేదో తెలుసుకొని రావాలి.''

నిర్ఘాంతపోయాను.

ఆమెను చూస్తుంటే నవ్వులాటకు మాట్లడడం లేదని స్పష్టంగా బోధపడింది. మిత్రవింద నాకంటే చాలా పెద్దదైపోయినట్టుగా అనిపించింది.

''మీరిద్దరూ ప్రేమించుకుంటున్నారా?'' అని అడిగాను.

అవునంది.

''యెన్నాళ్ళనుంచి?''

''నాలుగయిదు నెలలనుంచి...''

యిన్నాళ్ళుగా జరుగుతున్న ప్రేమాయణం నాకు తెలియకపోయినందుకు ఆశ్చర్యపడుతూ ''తరచుగా కలుసుకుంటున్నారా మీరు?'' అని అడిగాను.

''అవును. ప్రతి గురువారమూ లైబ్రరీలో కలుసుకుంటూ వుండేవాళ్ళం. అయినా లైబ్రరీలో యెక్కువగా మాట్లాడుకోవడం కుదిరేది కాదులే! వారానికి రెండు, మూడు వుత్తరాలు రాసుకునేవాళ్ళం.''

''వొకే వూళ్ళో వుంటున్న వాళ్ళు వుత్తరాలు రాసుకుంటారా యెక్కడైనా?'' విస్తుపోయా న్నేను.

''మాట్లాడుకోవడానికి వీల్లేకపోయినప్పుడు యింకో మార్గం మేముంది చెప్పు. నేను రాత్రంతా మేలుకుని ఆరేడు పేజీల వుత్తరాలు రాస్తూ వుండేదాన్ని. తానుకూడా చాలా పెద్ద ఉత్తరాలే రాస్తుండేవాడు. అలాంటివాడు, మదరాసు కెళ్ళాక వొక వుత్తరం కూడా రాయలేదు. నాకెందుకో కంగారుగా వుంది.''

''కిరణ్ వాళ్ళు మీ కాస్టు వాళ్ళు కాదు. ఆ సంగతి తెలుసా నీకు?''

''తెలుసు'' అది ముఖ్యమైన ప్రశ్న కాదన్నట్టుగా ముక్తసరి సమాధానంతో సరిపెట్టేసి ''నువ్వెలాగైనా మదరాసుకెళ్లి రావాలి....ప్లీజ్...'' అంది.

మిత్రవింద నాపైన యింత పెద్ద బాధ్యత పెట్టడంతో నేను కూడా పెద్దవాడినై పోయినట్టుగా తోచింది. కిరణ్ దసరా సెలవుల్లో మదరాసు చూపెడతాను రమ్మని వుత్తరం రాశాడని పోరు పెట్టి, యింట్లో పర్మిషన్ తీసుకున్నాను.

మదరాసు నుంచీ తిరిగొచ్చాక మిత్రవిందను కలవడం బ్రహ్మప్రళయమై పోయింది. వొక రోజంతా వాళ్ళింటి ముందే తచ్చాడాను. తరువాత అలా కుదరదని, ధైర్యం తెచ్చుకొని యేదో వేరే పనిపైన వచ్చినవాడిలా వాళ్ళింటికెళ్లాను. వాళ్ళ అన్నయ్యతో మాట్లాడుతూ కూర్చున్నాను. యెంతకూ ఆమె నా ముందుకు రాలేదు. పెద్ద ఆరిందాలా మదరాసు కెళ్ళి రమ్మని, తీరా వెళ్ళొచ్చాక నన్ను కలవనైనా కలవలేదు ఆమె. యింట్లో వాళ్ళకు భయపడి కలవడం లేదన్న సంగతి నాకు తెలుసు. పిరికివాళ్ళకు ప్రేమలూ, గీమలూ యెందుకోమరి?

కాలేజీలు తెరిచాకగానీ ఆమెతో మాట్లాడే అవకాశం దొరకలేదు. లైబ్రరీలో పుస్తకాలు

వెతుక్కుంటూ వుండగా తానే పలకరించింది. మదరాసు విశేషాలు చెప్పమన్నప్పుడు ఆమెను దులిపిపారేయాలని నేను చేసుకున్న రిహార్సల్సన్నీ విఫలమైపోయాయి.

''నీకు యెలా చెప్పాలో తెలియడం లేదు మిత్రా. కిరణ్ వోణీలు, చీరలు కట్టే పాతకాలపు ఆడపిల్లల్ని పెళ్ళి చేసుకోలేనని అన్నాడు. మదరాసులో అమ్మాయిలు జీన్స్, షల్వార్ కమీజులు తొడుక్కుంటారట'' అని చెప్పాను.

మిత్రవింద సమాధానమేమీ చెప్పలేదు. కాసేపు మౌనంగా నిల్చుండిపోయింది. తరువాత నాకు థాంక్స్ చెప్పి వెళ్ళిపోయింది.

కొన్ని విషయాలను గురించి చర్చించడమూ, కొన్ని పరిస్థితులలో యెదురొడ్డి పోరాడటమూ ఆమె స్వభావం కాదు. నిజానికి ఆమె మౌనం చర్చలకంటే, పోరాటం కంటే శక్తివంతంగా కనిపిస్తూ వుంటుంది నాకు.

తొమ్మిది గంటల ప్రాంతంలో జగన్ వార్డులోంచి బయటికొచ్చి ''డాక్టరు యీ యింజెక్షన్ వెంటనే కావాలని అంటున్నారు. హాస్పిటల్లో లేదట యిది'' అన్నాడు.

ప్రిస్క్రిప్షన్ కాగితం చేత బట్టుకొని ఆటోలో మళ్ళీ పట్టణం పైన బడ్డాను. యింజెక్షన్ బాటిల్‌తో తిరిగొచ్చేసరికి గంట తొమ్మిది ముప్పావు దాటింది. పది గంటల తరువాత డాక్టరు సుధీర్ కుమార్ వార్డులోంచీ బయటికొచ్చాడు.

''మేము చేయగలిగినదంతా చేశాము. పరిస్థితింకా అలాగే వుంది. యింకో రెండు గంటలు దాటిన తరువాత గానీ యే సంగతి తెలియదు. యిక నేనిక్కడుండి చేసేదేమీ లేదు. పన్నెండుకు మా వాళ్ళను ఫోన్ చేయమని చెప్పాను'' అన్నాడతను.

కాంపౌండ్ వాల్ దగ్గరికెళ్ళి ఆటో తీసుకొచ్చి ఆయన యింటికెళ్ళే ఏర్పాటు చేశాను. జగన్ కూడా వెళ్ళిపోయాడు.

వార్డు ముందున్న చెట్టు కింద, సిమెంటు చప్టాపైన యిద్దరమూ కూర్చున్నాము.

వుమెన్స్ హాస్టలు వరండాలో కూర్చున్న నైటీ విద్యార్థినులు మినహా చుట్టూ జనసందోహమేమీ లేదు. అలిపిరి కొండలపైని దీపాల వరస అనారోగ్యంతో పడుకున్న రోగికి ఆక్యుపంక్చర్ చికిత్స కోసం గుచ్చిన గుండుసూదుల్లా కనిపిస్తోంది.

హాస్పిటల్ ముఖ్య భవంతిలో శబ్దాల సంరంభం బాగా తగ్గిపోయింది. వార్డు ముందున్న నియాన్ లైటు చుట్టూ దీపం పురుగులు సంగీత సాధన చేస్తున్నాయి.

మిత్రవింద కేసి చూశాను. ముఖాన్ని అరిచేతుల్లో వుంచుకొని థింకర్ స్టాచ్యూలా కూర్చుని వుంది ఆమె.

''భోంచేస్తావా మిత్రా?'' అని అడిగాను.

''ఆకలిగా లేదు'' రెండు నిమిషాల తరువాత- ''నువ్వు కూడా యేమీ తినలేదనుకుంటాను. క్యాంటీన్‌కైనా వెళ్లిరా రాజూ!'' అంది.

''నాకూ ఆకలిగా లేదు'' అన్నాను.

తల పైకెత్తి నాకేసి సూటిగా చూసి, తరువాత సుళ్ళీ తలవంచుకొని కూర్చుంది.

సిగరెట్టు వెలిగించుకున్నాను.

దాదాపు సగం సిగరెట్టు కాలిపోయిన తరువాత ''నువ్వింకా సిగరెట్లు మానలేదన్న మాట!'' అంటూ నిట్టూర్చింది.

''పుట్టుకతో వచ్చిన బుద్ధి. నువ్వు గోళ్ళు కొరకడం మానడమూ, నేను సిగరెట్టు వొదిలిపెట్టడమూ యీ జన్మలో జరిగేటట్టు లేదు'' అన్నాను.

మిత్రవింద మొదటి పెళ్లి సంబంధం సంగతి గుర్తుకొచ్చింది. అవి ఆమె బ్యాంకులో గుమాస్తాగా కొత్తగా జాయినయినప్పటి రోజులు. యేదో పనిమీద వాళ్ళ బ్రాంచీకి వెళ్లాను. కుర్చీ నొకదాన్ని తన సీటు పక్కకు లాగుతూ ''కాసేపు కూచో రాజూ! నీతో చిన్న పనుంది'' అంది.

కూర్చున్నాను.

లెడ్జర్ బుక్‌లో రాసుకుంటూ, తలపైకెత్తయినా చూడకుండా - ''చిత్తూరు స్టేట్ బ్యాంకులో భానుమూర్తి అనే ఆఫీసరున్నాడట. నీకు తెలుసా?'' అని అడిగింది.

'' తెలియదు. పనేమిటో చెప్పు...'' అని అడిగాను.

''అలయన్స్....'' చిరునవ్వు నవ్వుతోంది.

''ఎవరికి?''

''నాకే.''

''అలా చెప్పు. కంగ్రాట్స్.''

''హోల్డాన్. యింకా ప్రిలిమినరీస్ పూర్తి కాలేదు. నువ్వోసారి అబ్బాయెలాంటి వాడో కూపీ లాగాలి. యెవరో అతను సిగరెట్లు కాలుస్తాడని అన్నారు.''

''సిగరెట్లు తాగడం డిస్క్వాలిఫికేషనా?'' అంటూ రెట్టించాను.

''నీ చొక్కా జేబులోంచీ సిగరెట్టు పెట్టె కనిపిస్తోంది రాజూ!'' ఆమె చిరునవ్వు నవ్వేసింది.

ఆ తరువాత పదిహేను రోజులకు మళ్లీ వాళ్ళ బ్రాంచీకి వెళ్లాను.

''ఆ భానుమూర్తిని గురించిన సంగతులన్నీ వాకబు చేసి తెలుసుకున్నాను. అతను వాళ్ళ అమ్మానాన్నలకు వొక్కడే కొడుకు. యిద్దరు అక్కలున్నారు. యిద్దరికీ పెళ్లయిపోయింది. వొకామె బెంగుళూరులోనూ, రెండో ఆమె వేలూరులోనూ వుంటున్నారు. అతణ్ణి కూడా కలిశాను. నువ్వు పంపించిన గూఢచారినని చెప్పలేదనుకో. అతను బాగానే వున్నాడు. సన్నగా, పొడుగ్గా, యెర్రగా...'' అంటూ నా రిపోర్టును సమర్పించాను.

అంతా విన్న తరువాత! తాపీగా ''నీకు చాలా శ్రమిచ్చాను రాజూ! ఆ సంబంధం కాన్సిలయిపోయింది'' అంది మిత్రవింద.

మౌనంగా వుండిపోయాను.

నాకు కోపమొచ్చినట్టుగా ఆమె గుర్తించినట్టుంది.

''కట్నం బాగా వచ్చే సంబంధమేదో దొరికినట్టుంది వాళ్ళకి. అయినా పెళ్ళిళ్ళు మనమనుకున్నట్టుగా జరుగుతాయా యేమయినానా? మన చేతుల్లో యేముంది చెప్పు?'' వేదాంతీకరించడం మొదలుపెట్టింది.

''నీకు చెయిన్ స్మోకర్ భర్తగా దొరుకును గాక!'' అంటూ ఆశీర్వదించాను.

''తథాస్తు'' అంది ఆమె నవ్వేస్తూ.

ఆ తరువాత ఆరునెలలకు ఆమె పెళ్ళి నిశ్చయమైంది. వోరోజు వాళ్ళింటి ముందుగా వెళ్తుంటే పిలిచింది. వెళ్లాను. యిన్విటేషను యిచ్చింది. చూశాను. వరుడి పేరు కుమారస్వామి. అనంతపురంలో లెక్చరరు.

వున్నట్టుండి నాకు కిరణ్, భానుమూర్తీ గుర్తుకొచ్చారు. 'వాళ్ళకు ఆహ్వానాలు పంపావా?' అన్న ప్రశ్నను అతి బలవంతంపైన గొంతులోనే అణిచిపెట్టేశాను. వెక్కిరించే వంకర నవ్వును మాత్రం ఆపుకోలేకపోయాను. యెందుకలా నవ్వుతున్నావని ఆమె నన్నడగలేదు. అడగకుండానే అవగతమైనట్టుగా ఆమె సైతం నవ్వేసింది.

రోడ్డుపైన యేదో మోటారు వాహనం గొంతు చించుకుంటోంది. వుమెన్స్ హాస్టలు ముఖద్వారపు తలుపులు వేసేసి చాలా సేపయిపోయింది. నియాన్ దీపపు స్తంభం దగ్గర రెక్కలు రాల్చుకున్న పురుగుల సంఖ్య బాగా పెరిగింది. పన్నెండు గంటల వరకూ కాలం నత్తనడక నడచింది.

వార్డులోకి వెళ్ళి పరిస్థితెలా వుందని హౌస్సర్జన్ నడిగాను.

''యింప్రూవ్‌మెంట్ కనిపిస్తోందండీ. లైఫుకు ప్రమాదం లేదు. యిప్పుడే డాక్టరు గారికి ఫోన్ చేశాను. మొత్తంపైన మీరు లక్కీ. పేషెంటు కీవేళ పెద్ద గండం తప్పింది'' అన్నాడతను.

మిత్రవింద కళ్ళు మిలమిలా మెరిశాయి. లోపలికెళ్లి రోగిని చూసి వచ్చాక ''యికనైనా కాంటీను కెళ్దాం పద మిత్రా! కాఫీ అయినా దొరుకుతుందేమో చూద్దాం'' అన్నాను.

సరేనంది ఆమె. కాంటీన్లో కాఫీ, టీలు కూడా అయిపోయాయి. రెండు అరటిపళ్ళు తిని, చల్లగా లేని డ్రింకులుతాగి తిరిగి వచ్చాము.

సిమెంటు చప్టాపైన కూర్చున్నాక ''అసలీ రోజు యిక్కడి కెందుకొచ్చావు, రాజూ, నువ్వు ?'' అని అడిగింది మిత్రవింద.

''యింతసేపటికి యీ లోకంలో కొచ్చావన్నమాట నువ్వు'' అంటూ నవ్వేశాను. ''మా కొలీగ్ వొకతన్ని చూడ్డం కోసం వచ్చాను. యెమ్మెస్ వార్డులో ఉన్నాడతను. చూసేసిన తరువాత టవున్ కెళ్దామని యిలా వచ్చాను. నువ్వు కనిపించావు. యిక్కడే యూనివర్సిటీలో మా స్నేహితుడొకడు లెక్చరరుగా వుంటున్నాడు. రాత్రి డిన్నర్‌కు

పిలిచాడు. పది గంటల బస్సుకయినా చిత్తూరు కెళ్లిపోవాలన్నది ప్రోగ్రాం. యెంత రాత్రయినా యింటికొచ్చేస్తానని మా ఆవిడతో చెప్పాను. ఎదురు చూస్తూందేమో పాపం'' అన్నాను.

''ఆ కంగారులో నిజంగా నా బుర్ర మొద్దుబారిపోయింది రాజా! అసలే మా అత్తగారికి నా పైన నమ్మకం తక్కువ. చదువుకున్న కోడళ్ళకు అత్తామామా అంటే అలుసని ఆమె అభిప్రాయం. యీయనగారేమో సమయానికి హాస్పటల్లో చేరలేదు. కొంపదీసి, అనుకోగూడనిదేమయినా జరిగుంటే, జీవితాంతం నిందమోసి వుండాల్సిందే నేను. తలుచుకుంటేనే భయంగా ఉంది. థాంక్ గాడ్!'' యింకా ఆమె పూర్తిగా టెన్షన్‌లోంచీ బయటపడ్డట్టు లేదు. గసబోస్తూ మాట్లాడుతోంది.

''అన్యాయంగా నీపైన నిందెలా వస్తుంది? మీవాళ్ళు భలేవాళ్ళుగా వున్నట్టున్నారు''.

''... ...''

''అయినా నిన్నిలా వొంటరిగా వదిలిపెట్టడం యేమీ బాగాలేదు. నువ్వూ, మీ ఆయనా, యిద్దరూ వుద్యోగాలు చేయాలి. యింటి దగ్గర వ్యవసాయమూ సాగాలి. అవ్వా, బువ్వా రెండూ కావాలంటే యెలా కుదురుతుంది? భూముల్ని కౌలుకిచ్చేసి, ఆ ముసలివాళ్ళిద్దరూ పాపని చూసుకుంటూ నీ దగ్గరే వుండిపోతే యేం పోయింది? యిలాంటి ఆపత్సమయాల్లో నీకు తోడెవరుంటారని వాళ్ళ వుద్దేశం?''

''... ... ...''

''మీ ఆయన యేమంటాడు?''

''యేమంటారు? వుద్యోగం మానమని చెప్పలేరు. ట్రాన్స్‌ఫర్ల కోసం ప్రయత్నాలు చేసీ చేసీ విసిగిపోయాము. వాళ్ళ అమ్మానాన్నలకు నచ్చజెప్పడం సాధ్యం కాదు. జీవితాన్ని శాసించలేనప్పుడు చేసేదేముంది? ప్రవాహంలో కొట్టుకుపోవడమే.''

''నేనీ మధ్య మన వూరికి వెళ్ళి చాలా రోజులైపోయింది . మీ అమ్మా నాన్న యెలా వున్నారు?''

''పరిస్థితులేం మారలేదు. అన్నయ్య వేరు కాపురం పెట్టాడు. యింటి మధ్య గోడ పెట్టి రెండు భాగాలు చేశారు. అమ్మానాన్నలను నా దగ్గర వుండమంటే వాళ్ళు వినరు. నా సంపాదనంతా మా పుట్టింటివాళ్ళకు దోచిపెడుతున్నానని మా అత్తయ్య అంటుందేమో అని వాళ్ళ భయం. యెంతకూ నా గొడవేనా, నీ సంగతులేమిటో చెప్పు. మీ పేరెంట్సెలా వున్నారు? మీ అన్నయ్యింకా కలకత్తాలోనే వున్నాడా?''

''అమ్మా నాన్నా యిప్పుడు నా దగ్గరే వున్నారు. అన్నయ్యకు బెంగుళూరుకు బదిలీ అయింది.''

''అన్నట్టు మీ అబ్బాయి పేరేమిటి?''

''సుధాకర్, మా నాన్నగారి పేరే పెట్టాను''

''మంచిపని చేశావు. మా పాపాయికికూడా మా అమ్మ పేరు పెడదామని అనుకున్నాను. మా అత్తగారికి భయపడి పెట్టలేదు''

''యేం పేరు పెట్టావింతకూ?''

''దివ్య''

''పోనీలే, యీసారికి అబ్బాయి పుడితే మీ నాన్నగారి పేరు పెడుదువు గానీలే''

''చాలు రాజూ! యీ వొక్క పాపాయితోనే తల బట్టగట్టిపోయింది. ఆపరేట్ చేయించుకుంటానంటే మా వాళ్లు వద్దని యెగురుతున్నారు. వుద్యోగమూ చేయాలి. పిల్లల్నీ కనాలి. పెళ్లయి అయిదేళ్లే అయినా నూరు సంవత్సరాల అనుభవం సంపాదించు కున్నాననుకో. అయినా నీకు నా సంగతులెలా అర్థమవుతాయిలే? అదృష్టవంతుడివి. అబ్బాయిగా పుట్టే అదృష్టం అందరికీ వుంటుందా చెప్పు?'' నవ్వడానికి ప్రయత్నించింది.

''పీత కష్టాలు పీతవని అంటారు. నా బాధలు నాకూ వున్నాయిలే మిత్రా. మా నాన్నగారు మొదలుపెట్టిన కోర్టు గొడవలు యింకా నన్ను వదిలిపెట్టలేదు. చాలని దానికి మా తమ్ముడు జులాయిగా తయారయ్యాడు. బియస్సీ మూడోసారి రాశాడు. మా అక్కయ్యకు పెళ్లయి పదేళ్లకు పైగా అయింది గదా. అప్పుడెప్పుడో యివ్వాల్సిన కట్నం తాలూకు బాకీ ఇంకా యివ్వనందుకు మా బావగారు అలిగి కూర్చున్నారు. అక్కయ్య మా యింటి ముఖం చూసి యేడాది దాటింది''

మేమిద్దరం చుట్టూ వున్న ప్రపంచాన్ని మరచిపోయి, వో రకమైన ట్రాన్స్‌లోకి వెళ్లిపోయి, వొకరి సంగతులు వొకరికి చెప్పుకుంటూ, వొకరి నొకరు వూరడించు కుంటూ, సలహాలు యిచ్చుకుంటూ కూర్చుండిపోయాం. అప్పుడప్పుడూ వార్డులోకి వెళ్లి రోగిని చూసి రావడం మినహాయిస్తే, మరో ఆటంకం మాకు కలగలేదు.

మా యిద్దరి జీవితాలూ, మేమెదుర్కొంటున్న కష్టాలూ అసాధారణమైనవేమీ గావు. యితరులెందరో యివే బాధల్ని భరిస్తూ వుండి వుండొచ్చు. తన సుఖదుఃఖాల్నీ, ఆవేశకావేషాల్నీ సానుభూతితో అర్థం చేసుకునే ఆత్మీయుల సాన్నిధ్యం యెంతో అరుదుగా దొరికే అవకాశం గదా! వేసవికాలం లాంటి జీవితంలో అప్పుడప్పుడూ కురిసే తొలకరి జల్లులాంటి ఆ సాన్నిధ్యం అరుదైనది మాత్రమే గాదు. చక్కనిదీ, చిక్కనిదీ కూడా!

బొమ్మల పెళ్లిళ్లు చేసే పాపాయి, చిత్త చాంచల్యాన్నే ప్రేమగా భావించిన పడుచుపిల్ల, ప్రపంచపు కఠిన వాస్తవాల్ని రుచిచూసిన తరువాత ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలనుకునే వుద్యోగిని, జీవితాన్ని శాసించలేక సర్దుబాటుతనాన్ని నేర్చుకున్న గృహిణి - యివన్నీ వొకే వ్యక్తికి సంబంధించిన అనేక పరిణామ దశలని అనుకోవడానికి ఆశ్చర్యం కలగొచ్చు. కానీ అన్ని దశల్లోనూ ఆమెలో అదే చిత్తశుద్ధీ, మృదుత్వమూ, సున్నితత్వమూ కనిపిస్తూ వచ్చాయి. ఆమె నా దగ్గర యేదీ దాచుకోలేదు. నా దగ్గర తన రహస్యాలు వెల్లడయ్యాయన్న గాబరా ఆమెకు లేదు. ఆమెను యిబ్బంది పెట్టే ప్రశ్నలేవీ నేనడగలేదు. జరిగిపోయిన సంగతుల్ని గుర్తుచేసి ఆమెను బాధపెట్టడం నాకిష్టం లేదు.

ఆ సమయంలో మా యిద్దరి మధ్యా తయారైన అద్భుత ప్రపంచపు కాలాన్ని వాస్తవ ప్రపంచపు కాలమానంతో కొలవడం నాకిష్టం లేదు.

మెల్లమెల్లగా అలిపిరి కొండలు చీకటి దుప్పటిని తొలగించుకోసాగాయి. నల్లటి ఆకాశపు కాన్వాసుపైన యే రంగును పులుముతున్నారో తెలియదుగానీ, క్రమంగా నీలిరంగు ప్రత్యక్షమవుతోంది. తూర్పు దిక్కు సూర్యుడి కోసం రెడ్ కార్పెట్ పరవడం మొదలు పెట్టిన తరువాత పైకి లేచాను.

''బాగా తెల్లవారిపోయింది మిత్రా. నేనోసారి వూళ్లోకెళ్లి వస్తాను. రాత్రి మా స్నేహితు డొకడు డిన్నరుకు పిలిచాడని చెప్పాను కదా! వెళ్లి జరిగిన సంగతి చెప్పాలి. రాత్రంతా నిద్రపోలేదు కదా! స్నానం చేస్తేనేగానీ బడలిక పోదు. మళ్లీ వో గంటలో వచ్చేస్తాను. వస్తూ వస్తూ నీ కోసం టిఫిను తీసుకొస్తాను'' అన్నాను.

''వద్దులే రాజూ! కావాలిస్తే నువ్వొచ్చాక యిద్దరం కలిసి యిక్కడే కాంటీను కెళ్దాం'' అంది మిత్రవింద.

మా మిత్రుడి యింటికెళ్లి స్నానపానాలు ముగించి, తిరిగి హాస్పిటల్ చేరేటప్పటికి గంట యేడున్నర దాటింది.

అప్పటికింకా హాస్పిటల్ రాత్రి వేసుకున్న నిద్రమాత్రల తాలూకు హేంగోవర్‌లోంచీ పూర్తిగా కోలుకున్నట్టులేదు. తెల్లటి వస్త్ర కిరీటాల్తో నర్సులు కాంతుల్ని మోసుకొస్తున్నారు. వుమెన్స్ హాస్టల్లోంచీ స్టెతస్కోపుల నూపుకుంటూ విద్యార్థినులు కాలేజీవైపు కెళ్తున్నారు.

కార్డియాలజీ వార్డు ముంగిటిలోని లైటుస్తంభంకింద రాలిన పురుగుల రెక్కల్ని పనివాడు చీపురుతో వూడుస్తున్నాడు.

వార్డు వరండాలోని బెంచీ ఖాళీగా వుంది. వార్డులోకెళ్లి తొంగి చూశాను.

''రాజేష్! యేమిటిక్కడున్నావ్?'' అంటూ పలకరింపు వినిపించింది.

మిత్రవింద నాన్నగారు కనిపించారు. పక్కనే వాళ్లమ్మకూడా వుంది. ఆమె పక్కనున్న ముసలావిడ మిత్రవింద అత్తగారై వుండొచ్చు.

మిత్రవింద గాజుగ్లాసులో పాలు కలుపుతోంది. మంచంపైన పడుకున్న ముసలాయనకు కూడా స్పృహ వచ్చినట్టుంది. అరమోడ్పు కన్నులతో చూస్తున్నాడు.

''రావయ్యా రాజేష్! మా బావగారికి గుండెనొప్పి వచ్చిందని హాస్పిటల్లో చేర్పించాం. నయమైందిలే. అవునూ, నువ్విలా వచ్చావేమిటి?'' మరోసారి అడిగాడు ఆయన.

రాత్రంతా నేను వాళ్ల అమ్మాయితో బాటూ అక్కడే జాగరణచేశానన్న సంగతి ఆయనకు తెలిసినట్టు లేదు. సమాధానమేమని చెప్పాలో తోచక చిరునవ్వు నొకదాన్ని అరువు తెచ్చుకున్నాను.

''సమయానికి మేమెవరం వూళ్లో లేము. పాపం, మా అమ్మాయే హాస్పిటల్లో అడ్మిట్

చేసింది. పొరుగింటి వాళ్లు ఫోన్ చేసి చెప్పారు మాకు. మేమిక్కడికొచ్చి అరగంటైంది'' తన ధోరణిలో తాను చెప్పుకుపోసాగాడాయన.

జరిగిన సంగతిని మిత్రవింద తన వాళ్లందరికీ యెందుకు చెప్పలేదు? ఆమెపైన చెప్పలేనంత కోపం వచ్చింది.

''మా స్నేహితుడొకడు యెమ్మెస్ వార్డులో వున్నాడులెండి. వెళ్తూ వుంటే మీరు కనిపించారు. సంగతేమిటో తెలుసుకుందామని యిలా వచ్చాను'' అన్నాను.

''యెక్కడున్నావు. యెందరు పిల్లలు. మీ అన్నయ్యెక్కడున్నాడు?'' మొదలైన కుశల ప్రశ్నల్ని అడగసాగాడాయన.

అన్నింటికీ అన్యమనస్కంగా, ముక్తసరిగా సమాధానాలు చెప్పసాగాను.

యెంతసేపు వేచి చూసినా రాత్రి జరిగిన సంగతి ఆమె వాళ్లవాళ్లకు చెప్పనే లేదు. మౌనంగా తన పని తాను చేసుకుపోతోంది.

''యిక వెళ్తానండి. యిప్పటికే ఆలస్యమైపోయింది. బస్సెక్కి బాంకు టైముకు చిత్తూరుకు చేరుకోవాలి'' అన్నాను.

మిత్రవింద నాకేసిచూస్తూ చిరునవ్వు నవ్వింది. ఆ క్షణంలో ఆమె ముఖంలో కనిపించిన భావాలకు అర్థమేమిటో నాకు స్ఫురించలేదు.

వాళ్లదగ్గర సెలవు తీసుకుని వెనుదిరిగాను. కాంటీను కెళ్లి కూర్చుని కాఫీ కోసం ఆర్డరిచ్చాను. సిగరెట్టు వెలిగించుకున్నాను.

మా స్నేహాన్ని గురించి తన వాళ్లకు చెప్పడానికి మిత్రవింద కెందుకింత భయం? తాను వుద్యోగం చేస్తోంది. భయపడవలసిన అవసరం ఆమెకేముంది? రాత్రి ఆమెకో వ్యక్తి సహాయం చేశాడన్న విషయాన్ని డాక్టరో, నర్సో, హౌస్సర్జనో చెప్పకుండా వుంటారా? అప్పుడేం చేస్తుంది మిత్రవింద? యెవరో తన కొలీగ్ సహాయం చేశాడని చెప్పి, మాట దాటేస్తుందేమో!

ఆలోచించే కొద్దీ అది భయం కాదేమోనని నా కనిపించసాగింది. అర్థం చేసుకోలేని వ్యక్తులకు బోధించి మాత్రం లాభమేముంది? చెవిటి వాళ్లముందు శంఖం వూదితే వినిపిస్తుందా, యేమయినానా? కొన్ని విషయాలను గురించి యితరులతో చర్చించడం వల్ల వాటికున్న విలువ తగ్గుతుంది కదా!

''హలో, యిక్కడున్నారా మీరు?'' అంటూ పలకరించాడు జగన్.

కూర్చోమంటూ కుర్చీ చూపెట్టాను.

''పేషెంటు యెలా వున్నాడు?'' అని అడిగాడు.

''కోలుకున్నాడు. స్పృహ వచ్చింది'' అన్నాను.

''అన్నట్టు అసలు సంగతి అడగడం మరచిపోయాను. యింతకీ పేషెంటు మీ

కేమవుతాడు?'' యెదురుచూడని ప్రశ్ననే సంధించాడు అతను.

వొకటి రెండునిముషాలు ఆలోచించిన తరువాత పెదవుల్ని సాగదీస్తూ, ''తెలిసిన వాళ్ళు. మావూరే'' అని సమాధానం చెప్పాను.

మా స్నేహం మా ఆంతరంగిక రహస్యంగా వుండిపోవాలని మిత్రవింద భావించి వుండవచ్చు. అయినా ప్రపంచానికి తెలియకపోయినంత మాత్రాన, మా స్నేహానికి కలిగే నష్టమేముంది?